తరిగిపోతున్న తీరాలు..!

- కోతకు గురవుతున్న నదీతీర ప్రాంతాలు
- ప్రతిఏటా తప్పని ఇబ్బందులు
- పట్టించుకోని అధికారులు, ప్రజాప్రతినిధులు



తమ్మినాయుడుపేట ప్రాంతంలో కోతకు గురైన ప్రాంతం

ఎచ్చెర్ల క్యాంపస్:

వర్షాకాలం వస్తే నదీతీర ప్రాంతాల్లోని ప్రజలు బిక్కుబిక్కుమని గడపాల్సిన పరిస్థితులు మారడం లేదు. ప్రతిఏటా తీరం కోతకు గురవు తుండడంతో తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటు న్నారు. ఎచ్చెర్ల మండలంలో నాగావళి నదీతీరం 18 కిలోమీటర్లు విస్తరించి ఉంది. తమ్మినాయుడు పేట, సనపలవానిపేట, తోటపాలేం, పొన్నాడ, పాతపొన్నాడ, తెప్పరేవు, బొంతలకోడూరు, కాళింగపేట, లావేటిపేట గ్రామాల్లో నదీతీర ప్రాంతం నిత్యం కోతకు గురవుతోంది. ప్రతిఏటా ఆగస్టు, సెప్టెంబర్, అక్టోబర్, నవంబర్ నెలల్లో ఈ సమస్య ఎక్కువగా ఉంటోంది. దీంతో ఈ ప్రాంతాల్లో గ్రోయిన్ల నిర్మాణాలు చేపట్టాలని ప్రజలు ఎప్పటినుంచో కోరుతున్నారు. కానీ అధికారులు, ప్రజాప్రతినిధులు పట్టించుకోకపోవడంతో నిర్మాణాలు జరగడం లేదు. ఫలితంగా వరదల సమయాల్లో ఈ ప్రాంతాల్లో ఎక్కువగా సాగు చేస్తున్న జీడిమామిడి, అరటి, సరుగుడు, నీలగిరి వంటి తోటలు కొట్టుకుపోతున్నాయని స్థానికులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. గతంలో నదీతీర ప్రాంతంలో అనేకసార్లు గ్రోయన్ల నిర్మాణం కోసం సర్వేలు సైతం నిర్వహించారు. కానీ నిర్మాణాలు చేపట్టకపోవడంతో ఏటా కోత తప్పడం లేదు. కోతతో క్రమేపీ నది ఒడ్డు సైతం బలహీనపడు తోంది. అనధికారకంగా ఇసుక తరలింపు సైతం నదీతీరం కోతకు ఒక సమస్యగా చెప్పవచ్చు.

గ్రోయన్లు నిర్మించాలి



గ్రోయన్ల నిర్మాణానికి అధికారులు, ప్రజాప్రతినిధులు చర్యలు తీసుకోవాలి. ప్రస్తుతం ఈ ప్రాంతంలో ఇది ప్రధాన సమస్య. స్థానికంగా ప్రజలు చాలా ఇబ్బందులు పడుతున్నారు. గ్రోయన్ల నిర్మాణం జరగకపోతే ప్రతిఏటా కోత తప్పదు. భవిష్యత్తులో ఇది ప్రధాన సమస్యగా మారుతుంది.

–పంచిరెడ్డి రాంబాబు, సర్పంచ్, బొంతలకోడూరు

భూములు కోతకు గురవుతున్నాయి



ప్రతిఏటా నదీతీర ప్రాంతంలో జిరాయతీ భూములు కోతకు గురవుతున్నాయి. ఈ ప్రాంత రైతులకు ప్రధాన సమస్య ఇది. ప్రభుత్వం స్పందించి సర్వే నిర్వహించాలి. గ్రోయన్లు అవసరమైన చోట్ల తక్షణం నిర్మించాలి. ప్రాథమికంగా కోతకు ఎక్కువగా గురవుతున్న ప్రాంతాలు గుర్తించి రాతి కట్టడాలు నిర్మించాలి.

–నేతింటి యమున, సర్పంచ్, పొన్నాడ

క్లుప్తంగా

వరి నష్టంపై నివేదిక



దర్మవరంలో వరి వెదలు పరిశీలిస్తున్న అధికారులు

ఎచ్చెర్ల క్యాంపస్: వరి వెదలు నీట మునిగిన నష్టంపై ఉన్నతాధికారులకు నివేదిక అంద జేయనున్నట్లు ఎచ్చెర్ల వ్యవసాయ అధికారి వై.సురేష్ తెలిపారు. పొన్నాడ, ధర్మవరం గ్రామాల్లో వరి వెదల పరిస్థితిని శనివారం పరి శీలించారు. గ్రామస్థాయిలో వచ్చిన ఫిర్యాదులు పరిశీలిస్తున్నట్లు వివరించారు. ప్రస్తుతానికి పంట నష్టం లేదని, వెదల్లో నీటి నిల్వ లేకుండా రైతులు జాగ్రత్త పడాలని సూచించారు.

తోటపల్లి కాలువ పరిశీలన



కాలువ పరిశీలిస్తున్న ఎమ్మెల్యే ఎన్ఈఆర్ తదితరులు

రణస్థలం: తోటపల్లి కాలువ ద్వారా మండలా నికి సాగునీరు వచ్చేలా చర్యలు చేపడతామని ఎచ్చెర్ల ఎమ్మెల్యే ఎన్.ఈశ్వరరావు తెలిపారు. మండలంలోని రణస్థలం గ్రామంలో తోటపల్లి కాలువను శనివారం పరిశీలించారు. ఈ సందర్భంగా రైతులతో మాట్లాడుతూ కాలువలో పిచ్చి మొక్కలు తొలగించి, సాగునీరు అందేలా చూస్తామని హామీ ఇచ్చారు. కార్యక్రమంలో తోటపల్లి జేఈ రామలక్ష్మి, కూటమి నాయకులు పిన్నింటి భాను, లంక ప్రభ, పిషిణి జగన్నాథ తదితరులు పాల్గొన్నారు.

రిమ్స్‌కు వీల్‌చైర్ల వితరణ



వీల్‌చైర్లు అందజేస్తున్న బ్యాంకు మేనేజర్లు ఉషాకిరణ్, రాజేంద్రదీపక్

శ్రీకాకుళం : రిమ్స్ ఆస్పత్రి, మెడికల్ కళాశాలకు ఇండియన్ మెడికల్ అసోసియేషన్ ఆధ్వర్యంలో బ్యాంక్ ఆఫ్ బరోడా 117వ ఆవిర్భావ దినోత్సవం సందర్భంగా బ్యాంక్ మేనేజర్లు ఉషాకిరణ్, రాజేంద్రదీపక్ శనివారం వీల్ చైర్లు అందజేశారు. ఈ సందర్భంగా అసోసియేట్ ప్రెసిడెంట్ డాక్టర్ నర్సింహమూర్తి మాట్లాడుతూ వైద్యం కోసం వచ్చే పేద రోగులకు వీల్ చైర్లు ఉపయోగ పడతాయన్నారు. కార్యక్రమంలో రిమ్స్ ఆర్ఎంవో డాక్టర్ సుభాషిణి, డిప్యూటీ సూపరింటెండెంట్ డాక్టర్ పార్థసారథి, డాక్టర్లు షర్మిల, అనూరాధ, బ్యాంకు సిబ్బంది పాల్గొన్నారు.

పెండింగ్ బిల్లులు చెల్లించాలని ఆదేశం



ఉత్వర్వుల ప్రతిని చూపిస్తున్న ఎంపీపీ చిరంజీవి

ఎచ్చెర్ల క్యాంపస్: ఫరీదుపేట గ్రామంలో కాంట్రాక్టర్ మొదలవలస కృష్ణ గత ప్రభుత్వంలో రూ.20 లక్షలతో అభివృద్ధి పనులు చేశారు. అయితే ప్రస్తుతం ఈ బిల్లులు చెల్లింపునకు అధికారులు ముందుకు రాకపోవడంతో ఎచ్చెర్ల ఎంపీపీ, హైకోర్టు నాయవాది మొదలవలస చిరంజీవి ద్వారా కాంట్రాక్టర్ హైకోర్టును ఆశ్రయించారు. గడప గడపకూ మన ప్రభుత్వం నిధులతో పనులు నిర్వహించగా, అధికారులు బిల్లులు చెల్లించడం లేదని హైకోర్టుకు తెలిపారు. ఈ మేరకు హైకోర్టు నిధులు చెల్లింపునకు ఆదేశాలు జారీ చేసిందని చిరంజీవి శనివారం తెలిపారు. హైకోర్టు డబ్ల్యూ/పీ ఫైల్ నంబర్ 9682/2024 ఉత్తర్వుల మేరకు ఆగస్టు 9వ తేదీలోపు బిల్లులు చెలించాలని ప్రభుత్వ యంత్రాంగాన్ని ఆదేశించినట్లు పేర్కొన్నారు.

జర్నలిస్ట్ నాయకుడు కూన మృతికి సంతాపం



కూన పాపారావు

శ్రీకాకుళం: ఇండియన్ జర్నలిస్ట్ యూనియన్ జాతీయ కౌన్సిల్ సభ్యుడు, ఏపీయూడబ్ల్యూజే రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు కూన పాపారావు(63) శుక్రవారం అర్ధరాత్రి గుండెపోటుతో నగరంలోని ఓ ప్రైవేటు ఆస్పత్రిలో కన్నుమూశారు. ఈయనకు భార్య, కుమారుడు, కుమార్తె ఉన్నారు. ఈ నెల 28న పలాసలో జరిగే ఏపీయూడబ్ల్యూజే యూనియన్ 31వ మహాసభల ప్రాంగణానికి కూన పాపారావు పేరు పెడుతున్నట్లు జిల్లా అధ్యక్ష,కార్యదర్శులు చింతాడ అప్పలనాయుడు, మహారణ ప్రకటించారు. పాపారావు మృతి పట్ల మాజీ మంత్రి ధర్మాన ప్రసాదరావు, ఎమ్మెల్యే కూన రవి కుమార్, సీపీఐ రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు చాపర సుందర్‌లాల్, జిల్లా కార్యదర్శి వెంకటరమణ సంతాపం తెలిపారు.

ముంపు ప్రాంతాల పరిశీలన

శ్రీకాకుళం రూరల్ : మండలంలోని చాపురం, పాత్రునివలస గ్రామాల్లో వ్యవసాయ భూములను జిల్లా వ్యవసాయ అధికారులు శనివారం పరిశీలించారు. నీట మునిగిన ఆకుమడుల వివరాలను సిబ్బందిని అడిగి తెలుసుకున్నారు. కార్యక్రమంలో జేడీ శ్రీధర్, ఏడీ ఎ.రజిని, మండల వ్యవసాయాధికారి ఉషాకుమారి పాల్గొన్నారు.

సంగీత భాండాగారం 'బండారు'

- లలిత సంగీతంలో మేటి కళాకారుడిగా గుర్తింపు
- నేడు గురుపౌర్ణమి సందర్భంగా సత్కారం



హార్మోనియంతో సంగీత సాధన చేస్తున్న బండారు చిట్టిబాబు

శ్రీకాకుళం కల్చరల్ : లలిత సంగీత దర్శకుడిగా, హార్మోనియం కళాకారుడిగా ఎంతోమంది అభిమానాన్ని చూరగొన్నారు శ్రీకాకుళం పట్టణానికి చెందిన కళాప్రవీణ బండారు చిట్టిబాబు. 77 ఏళ్ల వయస్సులోనూ ఉల్లాసంగా ఉంటూ నిత్యం సంగీత సాధన చేస్తూ నేటి తరానికి స్ఫూర్తిగా నిలుస్తున్నారు. ఆదివారం గురుపౌర్ణమి సందర్భంగా తరుణీకృష్ణ స్మారక ధార్మిక సేవా ట్రస్టు, దూసి ధర్మారావు ఫౌండేషన్ ఆధ్వర్యంలో శ్రీకాకుళం బాపూజీ కళామందిర్‌లో చిట్టిబాబును సత్కరించనున్నారు. ఇదే కార్యక్రమంలో 'లలిత సంగీత సుధానిధి' బిరుదుతో ఘన సన్మానం చేయనున్నారు.

దిగ్గజ సంగీత దర్శకులతో..

బండారు చిట్టిబాబు వద్ద అనేక మంది సంగీతం నేర్చుకున్నారు. అందులో ప్రముఖ సినీగాయకులుగా పేరొందిన జి.ఆనంద్, బి.ఎ.నారాయణ, మండపాక శారద, భారతీ రమేష్ తదితరులు ఉన్నారు. ఇప్పటికీ యువతరం వచ్చి ఈయన వద్ద మెలకువలు తెలుసుకుంటారు. చిట్టిబాబు గతంలో పెండ్యాల నాగేశ్వరరావు, కోటి వంటి సంగీత దర్శకులతో కలిసి పనిచేశారు. దూసి ధర్మారావు రచించిన ఎన్నో లలిత గీతాలకు బాణీలు కట్టారు. వీరి కుమారుడు, కోడలు కూడా సంగీత కళాకారులే.

సత్కారాలు, బిరుదులు..

1955లో సినీనటుడు రావి కొండలరావు, దూసి బెనర్జీలతో కలిసి ఏర్పాటు చేసిన సుకుమార్ ఆర్కెస్ట్రాలో భాగంగా లలిత సంగీత సేవ ఇప్పటికీ కొనసాగిస్తున్నారు. 1964లో ఆకాశవాణిలో ఆనాటి సినీ గాయని వసంత పాడిన 'బంగారు బండి రావమ్మ' అనే పాటకు స్వరాలను సమకూర్చి అందరి మన్ననలు పొందారు. 1970లో హెచ్ఎంవీ కంపెనీకి సంగీత దర్శకులుగా సేవలందించి జాతీయ స్థాయి సంగీత దర్శకునిగా గుర్తింపు పొందారు. 1974లో రాష్ట్రపతి చేతుల మీదుగా స్వర్ణపతకం అందుకున్నారు. 1983లో కళాప్రవీణ బిరుదు పొందారు. 1984లో రాష్ట్ర సంగీత నాటక అకాడమీ సభ్యునిగా సేవలందించారు. అరసవల్లి సూర్యనారాయణ స్వామి ఏకాంత సేవను గత 40ఏళ్లగా నిర్వహిస్తున్నారు. తన శిష్యులతో కలిసి ప్రతి ఏడాది ప్రదర్శన ఇస్తున్నారు. ఈ సేవలో వాడేది కేవలం హార్మోనియం, తబలా మాత్రమే.

మాజీ ఎమ్మెల్యే కిరణ్ పరామర్శ



పూడివలసలో పరామర్శిస్తున్న కిరణ్‌కుమార్

ఎచ్చెర్ల క్యాంపస్: ఎచ్చెర్ల మాజీ ఎమ్మెల్యే గొర్లె కిరణ్ కుమార్ శనివారం పలువురిని పరామర్శించారు. పూడివలస గ్రామ సర్పంచ్ జరుగుళ్ల కృష్ణారావు తల్లి రామలక్ష్మి ఇటీవల మరణించారు. దీంతో ఆ కుటుంబాన్ని పరామర్శించి సానుభూతి తెలిపారు. కుశాలపురంలో వైఎస్సార్‌సీపీ నాయకుడు పైడి త్రిమూర్తులు ఇటీవల గుండెకు శస్త్ర చికిత్స చేసుకున్నారు. దీంతో ఆయనను పరామర్శించి ఆరోగ్య పరిస్థితి తెలుసుకున్నారు. కుశాలపురం బైపాస్ కూడలిలో ఇటీవల వైఎస్సార్‌సీపీ నాయకుడు పైడి ఆనందరావు ఆటో మొబైల్ షాపు అగ్ని ప్రమాదంలో కాలిపోయింది. ఈ షాపును పరిశీలించి యజమానికి ధైర్యం చెప్పారు. ఆయనతో పాటు నాయకులు సనపల నారాయణరావు, సీపాన ఎర్రన్నాయుడు, సూర అప్పారావు, పైడి వెంకన్నగారి శ్రీను, పైడి చందు తదితరులు పాల్గొన్నారు.

యువకుడి అదృశ్యంపై కేసు నమోదు

ఎచ్చెర్ల క్యాంపస్: ఎచ్చెర్ల గ్రామానికి చెందిన యువకుడు జరుగుళ్ల చిన్నారావు గురువారం నుంచి కనిపించడం లేదని తండ్రి రాజారావు శనివారం ఎచ్చెర్ల పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేశారు. కుమారుడు మిస్సింగ్‌పై తల్లి దండ్రులు ఆందోళన చెందుతున్నారు.

25న నీలమ్మతల్లి ఆవేటి వారం

శ్రీకాకుళం కల్చరల్: పట్టణంలోని పెద్దబరాటం వీధిలో వెలసిన నీలమ్మతల్లి అమ్మవారి ఆవేటి వారం ఈ నెల 25న నిర్వహిస్తున్నట్లు ఆలయ ధర్మకర్త బరాటం సాయిరాజ్ ఒక ప్రకటనలో తెలిపారు. అమ్మవారి మూలవిరాట్‌కు పాలాభిషేకాలు, ముగ్రాట్ల సమర్పణ తదితర కార్యక్రమాలు ఉంటాయని, భక్తులంతా పాల్గొనాలని కోరారు.

25, 26 తేదీల్లో ఆధార్ స్పెషల్ డ్రైవ్

ఎచ్చెర్ల క్యాంపస్: ధర్మవరం గ్రామ సచివాలయంలో ఈనెల 25, 26 తేదీల్లో ఆధార్ స్పెషల్ డ్రైవ్ నిర్వహించనున్నారు. ఫోన్ నంబర్ లింక్, ఆధార్ కార్డులో తప్పులు, అప్‌డేట్, ఇతర సేవలు అందజేయనున్నట్లు అధికారులు శనివారం ఒక ప్రకటనలో తెలియజేశారు. పరిసర ప్రాంతాల ప్రజలు వినియోగించుకోవాలని కోరారు.

ఘనంగా గురుపౌర్ణమి తిరువీధి



తిరువీధి నిర్వహిస్తున్న భక్తులు



కోలాటం చేస్తున్న మహిళలు

శ్రీకాకుళం కల్చరల్ : అరసవల్లిలో షిరిడీసాయి తత్త్వప్రచార మందిరం ఆధ్వర్యంలో జరుగుతున్న గురుపౌర్ణమి వేడుకల్లో భాగంగా శనివారం తిరువీధి నిర్వహించారు. గ్రామ పురోహితులు భాస్కరభట్ల చంద్రశేఖరశర్మ, రాజేష్ శర్మ ఆధ్వర్యంలో కోటి లిఖిత నామ జపం పుస్తకాలతో మేళతాళాలు, కోలాటం నడుమ భక్తులు ఊరేగింపుగా తరలివెళ్లారు. అదే విధంగా, బొందిలీపురంలోని సాయిదర్బార్‌లో జరుగుతున్న గురుపౌర్ణమి ఉత్సవాలలో భాగంగా మూలవిరాట్‌కు 108 కలశాలతో అభిషేకం నిర్వహించారు. మహిళలంతా సమీపంలోని నాగావళి నది నుంచి జలాన్ని తీసుకురాగా, అర్చకులు సంతోష్ బ్రహ్మ అభిషేకాలు చేశారు.

విద్యార్థినికి అభినందన



ఝాన్సీని సన్మానిస్తున్న దృశ్యం

ఎచ్చెర్ల క్యాంపస్: ఎచ్చెర్ల శ్రీవేంకటేశ్వర ఫార్మసీ కళాశాలలో బీ–ఫార్మసీ చివరి ఏడాది చదువుతున్న విద్యార్థిని చిగిలపల్లి ఝాన్సీ నైపర్ ఎగ్జామినేషన్ (నేషనల్ ఇనిస్టిట్యూట్ ఆఫ్ ఫార్మాసుటికల్ ఎడ్యుకేషన్ అండ్ రీసెర్చ్) పరీక్షలో 869వ ర్యాంకు సాధించింది. దీంతో కోల్‌కత్తా నైపర్ సంస్థలో ఎం.ఫార్మసీ సీటు లభించింది. నేచురల్ ప్రొడక్ట్ ప్రత్యేకతగా ఎం.ఫార్మసీ చేయనుంది. దేశంలో ఐదు నైపర్ విద్యా సంస్థలు ఉండగా, ఈమె కోల్‌కత్తాలో ప్రవేశం ఎంచుకుంది. దీంతో విద్యార్థినిని ప్రత్యేకంగా కళాశాల యాజమాన్యం శనివారం అభినందించింది. కళాశాల మేనేజ్‌మెంట్ సభ్యురాలు దివంగత బుడుమూరు సౌదామణి జ్ఞాపకార్థం రూ.10 వేలను మేనేజ్‌మెంట్ సభ్యుడు బెండి రఘుకార్తీక్ అందజేశారు. కార్యక్రమంలో ఫార్మసీ ప్రిన్సిపాల్ డాక్టర్ కేఈవీ నాగోజీ, ఇంజినీరింగ్ ప్రిన్సిపాల్ డాక్టర్ రమణమూర్తినాయుడు, ఏవో బి.తిరుపతిరావు తదితరులు పాల్గొన్నారు.

భక్తిశ్రద్ధలతో శ్రీచక్ర సిరిజ్యోతి పూజలు



దీపాలు వెలిగిస్తున్న మహిళలు

శ్రీకాకుళం కల్చరల్: బలగ నాగావళి తీరంలో ఉన్న బాలత్రిపుర కాలభైరవ పీఠం దేవాలయంలో పౌర్ణమి సందర్భంగా శ్రీచక్రరూపేన సిరిజ్యోతి పూజలు శనివారం భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. పీఠం నిర్వాహకులు గణేష్ గురూజీ ఆధ్వర్యంలో మహిళలు శ్రీచక్రంపై దీపాలు వెలిగించి పూజలు చేశారు. కార్యక్రమంలో అధిక సంఖ్యలో భక్తులు పాల్గొన్నారు.

పంటకోత ప్రయోగం

కొత్తూరు: ప్రకృతి వ్యవసాయంలో భాగంగా వరిసాగు చేయనున్న పంట పొలాల్లో సాగు చేస్తున్న నవధాన్యాల సాగుపై మాకవరంలో పంటకోత ప్రయోగాలను ఎంటీ సూర్యనారాయణ శనివారం నిర్వహించారు. మాకవరం గోవిందరావు సాగు చేస్తున్న నవధాన్యాల పంటలో ప్రయోగం నిర్వహించగా 36 కిలోల పచ్చిరొట్ట ఎరువు దిగబడి వచ్చిందని సూర్యనారాయణ తెలిపారు. ఎకరా వరి పంటకు 5,382 కిలోల పచ్చిరొట్ట ఎరువులు అవసరమన్నారు. 18 రకాల విత్తనాలతో సాగు చేస్తున్న పచ్చిరొట్టతో పంట పండించడం వలన రైతులకు ఎన్నో ప్రయోజనాలు పొందవచ్చని తెలిపారు. కార్యక్రమంలో ప్రకృతి వ్యవసాయం ఎస్ఎఫ్ఏ మునలయ్య, సిబ్బంది చిన్నమ్మి, ధనలక్ష్మి, వెంకటరావు, రమణయ్య తదితరులు పాల్గొన్నారు.

అండర్ పాసేజ్ వద్ద అవస్థలు!



నడగాం వద్ద అండర్ పాసేజ్‌లో చేరిన నీరు

నరసన్నపేట: వర్షం పడితే రైల్వే అండర్ పాసేజ్‌ల వద్ద వాహనదారులతో పాటు స్థానికులు తీవ్ర అవస్థలు పడుతున్నారు. వీటివద్ద నీరు అధికంగా చేరడంతో రాకపోకలు నిలిచి పోతున్నాయి. మండల పరిధిలోని నడగాం, బాడాం, చిక్కాలవలసల వద్ద ఉన్న అండర్ పాసేజ్‌ల వద్ద ఈ పరిస్థితి నెలకుంది. మూడు రోజులుగా కురుస్తున్న వర్షాలకు నీరు అధికంగా అండర్ పాసేజ్‌ల కింద చేరడంతో ప్రజలు ఇబ్బంది పడుతున్నారు. దీనిపై ఆమదాలవలస రైల్వే స్టేషన్ ఏఈఎన్ బీవీఎస్ఎన్ మూర్తి స్పందిస్తూ పాసేజ్‌ల్లో చేరిన నీటిని ఆయిల్ ఇంజన్లతో తొలగించే చర్యలు చేపడుతున్నట్లు తెలిపారు.

ఆధ్యాత్మిక ఆదిపురుషుడు వ్యాసుడు



నరసింహమూర్తిని సత్కరిస్తున్న మందిరం సభ్యులు

శ్రీకాకుళం కల్చరల్: భారతీయ ఆధ్యాత్మికతకు ఆదిపురుషుడు వ్యాస భగవానుడని ప్రముఖ వక్త నిష్టల నర్సింహమూర్తి అన్నారు. పాలకొండ రోడ్డులోని ఉపనిషన్మందిరంలో వ్యాస పూర్ణిమ సందర్భంగా శనివారం గురుపూర్ణిమ విశిష్టతపై ప్రసంగించారు. భగవద్గీత, విష్ణు సహస్రనామాలు వ్యాసుని రచనలేనని గుర్తు చేశారు. అష్టాదశ పురాలు, భారత, భాగవతాలు, బ్రహ్మసూత్రాలు కూడా ఆయన అందించినవేనని పేర్కొన్నారు. కార్యక్రమంలో మందిరం సభ్యులు పతంజలి శాస్త్రి, ఆర్.నారాయణమూర్తి, ఎం.మోహనరావు, జంధ్యాల శరత్‌బాబు, బాబూరావు, ఎం.వెంకటరమణ, విశ్వేశ్వరరావు, మోహనరావు, జోగారావు, ఈశ్వరరావు, లక్ష్మీ, సరస్వతి తదితరులు పాల్గొన్నారు.

నీటమునిగిన పంట పొలాలు



పొన్నాడలో పంట పొలాల్లోకి చేరిన వర్షపు నీరు



బొంతలకోడూరులో జలమయమైన పొలాలు

ఎచ్చెర్ల క్యాంపస్: గత నాలుగు రోజులుగా కురిసిన వర్షాలకు ఎచ్చెర్ల మండలంలో పంట పొలాలు నీట మునిగాయి. పొన్నాడ, బొంతలకోడూరు, ధర్మవరం, తమ్మినాయుడుపేట, కొంగరాం ప్రాంతాల్లో పొలాలు జలమయంగా మారాయి. దీంతో రైతులు ఆందోళన చెందుతున్నారు. ప్రస్తుతానికి వర్షాలు ఆగితే నష్టం తక్కువగా ఉంటుందని వ్యవసాయ అధికారి సురేష్ తెలియజేశారు. గ్రామాల వారీగా వ్యవసాయ సహాయకుల నుంచి సేకరించిన వివరాలు ఉన్నతాధికారులకు తెలియజేస్తున్నట్లు చెప్పారు. పొలాల్లో నీరు నిల్వ అవ్వకుండా జాగ్రత్తలు తీసుకోవాలన్నారు.

బీఎస్‌టీఎఫ్ డైరీ ఆవిష్కరణ

శ్రీకాకుళం న్యూకాలనీ: జీవశాస్త్ర ఉపాధ్యాయులు(బీఎస్‌టీఎఫ్) డైరీని జిల్లా విద్యాశాఖాధికారి కె.వెంకటేశ్వరరావు శనివారం ఆవిష్కరించారు. ఈ సందర్భంగా డీఈఓ మాట్లాడుతూ జీవశాస్త్ర ఉపాధ్యాయుల ఫోరం అకడమిక్‌గా ఎంతో సహకారాన్ని అందిస్తున్నారని కొనియాడారు. ఈ నెల 21న సోంపేట ప్రభుత్వ ఉన్నత పాఠశాల, కాశీబుగ్గ జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలల్లో జీవశాస్త్ర ఉపాధ్యాయుల సమావేశాలు నిర్వహిస్తున్నట్టు జీవశాస్త్ర ఉపాధ్యాయుల ఫోరం జిల్లాశాఖ ప్రతినిధులు తెలిపారు. ఈ ప్రాంతీయ సమావేశాలను విజయవంతం చేయాలని పి.ఉదయ్‌కుమార్, పి.గోవిందరావు తదితరులు కోరారు.

ఉపాధి హామీ పనులపై ఆడిట్

పాతపట్నం: మండలంలోని 34 గ్రామ పంచాయతీల పరిధిలో 2023–24 ఏడాదిలో చేపట్టిన రూ.20.63 కోట్ల పనులకు సంబంధించి సోషల్ ఆడిట్ నిర్వహించనున్నట్లు డీపీవో బి.లవరాజు తెలియజేశారు. స్థానిక వెలుగు కార్యాలయంలో ఏపీడీ పి.రాధ ఆధ్వర్యంలో అన్ని గ్రామాల్లో ఉపాధి హామీ పథకం పనుల ఆడిట్‌పై సమీక్ష సమావేశం శనివారం నిర్వహించారు. ఎన్ఆర్ఈజీఎస్ నిధులతో చేపట్టిన పనులతో పాటు ఐటీడీఏ, పంచాయతీరాజ్ శాఖల సమన్వయంతో చేపట్టిన పనులు కూడా ఆడిట్ చేయడం జరుగుతుందన్నారు. ఒక ఎస్ఆర్పీ, 8 మంది డీఆర్పీలు, 8 మంది వీఎస్ఏలు ఆడిట్‌కు వచ్చారన్నారు. సమావేశంలో ఏపీవో సురేష్, జేఈ ప్రసాదరావు, ఏవో రాజమోహనరావు తదితరులు పాల్గొన్నారు.

పాఠశాలల వివరాలు ఇవ్వాలి

హిరమండలం: మండలంలో శిథిలావస్థలో ఉన్న ప్రభుత్వ పాఠశాలల వివరాలను అందించాలని ఎంఈవో కె.రాంబాబు సూచించారు. స్థానిక ఎమ్మార్సీ కార్యాలయంలో సీఆర్పీలు, ఎమ్మార్సీ సిబ్బందితో సమీక్ష సమావేశం శనివారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. వసతులు లేక విద్యార్థులు ఇబ్బందులు పడుతున్న పాఠశాలలు గుర్తించాలన్నారు. ఈనెల 22 నుంచి శిక్షసప్త కార్యక్రమాలు నిర్వహించేలా చూడాలన్నారు. అలాగే ఈనెలలో జరగనున్న ఆధార్ కాంప్ సర్వీసులను వినియోగించుకునేలా అవగాహన కల్పించాలని కోరారు.

వ్యాధుల వ్యాప్తిని కట్టడి చేయండి

నందిగాం: గ్రామాల్లో అంటువ్యాధులు ప్రబలకుండా చర్యలు చేపట్టాలని ఎంపీపీ నడుపూరు శ్రీరామమూర్తి అధికారులకు సూచించారు. శనివారం నందిగాం మండల పరిషత్ కార్యాలయ సమావేశ మందిరంలో అధికారులతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సీజనల్ వ్యాధులు ప్రబలే అవకాశం ఉన్నందున పంచాయతీ కార్యదర్శులు, ఏఎన్ఎంలు గ్రామాల్లో ప్రజలను అప్రమత్తం చేయాలని సూచించారు. అనంతరం మహిళలపై లైంగిక వేధింపుల కట్టడికి సంబంధించి ఓరియెంటేషన్ ప్రోగ్రామ్ నిర్వహించారు. కార్యక్రమంలో ఐసీడీఎస్ ఏసీడీపీఓ డి.ఉమామహేశ్వరి, తహసీల్దారు వి.పద్మావతి, పీహెచ్‌సీ వైద్యురాలు అనిత, ధాతారాం, ఎంఈఓ జి.నర్సింహులు, తెలుగుదేశం మండల పార్టీ అధ్యక్షుడు పినకాన అజయ్‌కుమార్, పంచాయతీ కార్యదర్శులు, మహిళా పోలీసులు, అంగన్‌వాడీ కార్యకర్తలు పాల్గొన్నారు.

బీజామృతంతో నారశుద్ధి

ఇచ్ఛాపురం రూరల్: ప్రకృతి వ్యవసాయంలో భాగంగా తయారు చేసిన బీజామృతం ద్రావణంతో నార శుద్ధి చేయడం ద్వారా మొలక శాతం పెంచవచ్చని ప్రకృతి వ్యవసాయం ఇన్‌చార్జి మద్దిలి చిట్టిబాబు అన్నారు. శనివారం మశాఖపురంలో మండల వ్యవసాయాధికారి టి.భార్గవి ఆధ్వర్యంలో నార శుద్ధి కోసం 200 లీటర్ల బీజామృతం తయారీ విధానాన్ని వివరించారు. దీని వల్ల మొలక శాతంతో పాటు ఏరు తెగులు నుంచి రక్షణ పొందవచ్చన్నారు. నారుల్లో చిన్న గుడ్ల నివారణకు ఈ ద్రావణం ఉపయోగపడుతుందన్నారు. కార్యక్రమంలో వ్యవసాయ సహాయకులు వెంకట్, ఐసీఆర్పీ నాగమణి, ఐబి రూప పాల్గొన్నారు.





